క్లుప్తంగా

230 మంది వలంటీర్ల రాజీనామా

సీతానగరం: మండలంలో ఇప్పటి వరకూ 230 మంది గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేశారని ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వంగలపూడికి చెందిన ఐదుగురు, రఘుదేవపురం-2కు చెందిన ముగ్గురు, సింగవరానికి చెందిన ఇద్దరు శుక్రవారం రాజీనామా లేఖలు అందజేశారన్నారు. దీంతో మండలంలో 341 మందికి 230 మంది రాజీనామా చేసినట్టు తెలిపారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోనాల సత్తిరాజు

బిక్కవోలు: మండలంలోని పందలపాక వడాల పెద పుల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోనాల సత్తిరాజు సత్కరించారు. శుక్రవారం ఏర్పాటుచేసిన అభినందన సభలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోనాల సత్తిరాజు మాట్లాడుతూ 29 ఏళ్ల క్రితం బాలికలు దూరం ప్రాంతాలకు వెళ్లలేక చదువు ఆపేస్తున్నారని ఈ పాఠశాలను ప్రారంభించామన్నారు. ఇప్పుడు అదే పాఠశాలలో ఇంటర్మీడియట్ కళాశాల ప్రారంభించిన తొలి ఏడాదే ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం విద్యార్థినులు ఆర్.లీలా శ్రావణి, పి.దేవి, టి.లీలా కుమారి తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



సీతానగరం నుంచి బయలుదేరిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యధిక సంఖ్యలో తరలివెళ్లారు. సీతానగరం నుంచి మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కోలా శ్రీను ఆధ్వర్యంలో నాయకులు సలాది వాసు, మట్ట కాపు, తోరం పోసియ్య, కోండ్రపు శ్రీనివాస్, దేవరపల్లి కృష్ణ తదితరులు బస్సుల్లో వెళ్లారు.

కొండగుంటూరులో ఎన్నికల ప్రచారం



కొండగుంటూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రాజశ్రీ

రాజానగరం: మండలంలోని కొండగుంటూరులో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి గడచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని, అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. మే 13న జరిగే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఆర్‌బీకేలలో గోనె సంచులు సిద్ధం

మధురపూడి: ధాన్యం కొనుగోలు నేపథ్యంలో మండలంలోని 24 గ్రామాలకు చెందిన 17 రైతు భరోసా కేంద్రాలలో 67,502 గోనె సంచులను రైతులకు అందుబాటులో ఉంచారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 16,600 ఎకరాల విస్తీర్ణంలో రబీ పంట సాగైంది. ఎంటీయూ 1156, 1221, 1153, ఆర్ఎన్ఆర్ 15048 రకాలను రైతులు పండించారు. ఈ ప్రాంతంలోని రైతుల నుంచి 49 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయనున్నది. అయితే సాగు ఆలస్యం కావడంతో, పంట కోతలు కూడా ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీనికి అనుగుణంగా కొనుగోళ్లు జరుగుతున్నాయి.

నామినేషన్ బోణీ

అనపర్తి: అనపర్తి అసెంబ్లీ స్థానానికి నామినేషన్ బోణీ అయ్యింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన ఈ నెల 18న ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రెండో రోజు శుక్రవారం మండలంలోని రామవరం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి తొలి నామినేషన్ వేసినట్లుగా ఏఆర్ఓ, తహసీల్దార్ సునీల్‌బాబు తెలిపారు.



వడిశలేరులో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్



ఎస్టీ రాజాపురంలో సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో అభిమానులు



రోడ్‌షోలో సీఎం జగన్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



రంగంపేటలో భారీగా తరలి వచ్చిన జనంతో కిక్కిరిసిన రోడ్డు



రంగంపేటలో సీఎం జగన్ కోసం ఎదురుచూస్తున్న నాయకులు



రంగంపేటలో సీఎం జగన్ రోడ్‌షో చూసేందుకు వచ్చిన ప్రజలు



వడిశలేరులో జై జగన్ అంటూ నినదిస్తున్న అభిమానులు

జననేతకు ఘన స్వాగతం

- సీఎం జగన్ బస్సు యాత్రకు అపూర్వ స్పందన
- అభిమాన సంద్రంతో తడిసి ముద్దయిన మెట్ట
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు
- ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగిన ముఖ్యమంత్రి
- పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



రంగంపేటలో ప్రజలకు బస్సు పైనుంచి అభివాదం చేస్తున్న సీఎం జగన్



వడిశలేరులో ఆనందంతో డ్యాన్స్ చేస్తున్న మహిళలు

రంగంపేట: ఓవైపు 40 డిగ్రీల మండుటెండ.. మరోవైపు పొగలు కక్కుతున్న ఏడీబీ రోడ్డు.. అయినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానం ముందు భానుడి భగభగలు సైతం చిన్నబోయాయి. సంక్షేమ సారథిగా తమ గుండెల్లో కొలువైన జగనన్నను చూసేందుకు గ్రామాలకు గ్రామాలే కదలి రావడంతో రహదారులన్నీ జనసంద్రమయ్యాయి. లక్షలాదిగా తరలివచ్చిన అభిమాన సంద్రంతో మెట్ట తడిసి ముద్దయింది. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేసిన సీఎం జగన్‌కు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర శుక్రవారం మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలోని గ్రామాల మీదుగా సాగింది. మార్గంమధ్యలో అడుగడుగునా బస్సును ఆపి వృద్ధులు, చిన్నారులు, యువత, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ జగన్ ముందుకు సాగారు. రోడ్‌షో సాగే రహదారికి ఇరువైపులా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి తమ అభిమాన నేతను చూసేందుకు పోటీ పడ్డారు. ఒక్క మాటలో చెప్పాలంటే సీఎం జగన్ బస్సు యాత్రకు అపూర్వ స్పందన లభించింది.

రోడ్‌షో సాగిందిలా

గురువారం రాత్రి రంగంపేట మండలం ఎస్టీ రాజాపురంలో బస చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఉదయం తిరిగి యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తన కుటుంబ సభ్యులతో సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. అనపర్తి నియోజకవర్గంలోని రంగంపేట మండలం ఎస్టీరాజాపురం, వడిశలేరు, రంగంపేట, కోటపాడు గ్రామాల మీదుగా యాత్ర సాగించారు. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, అభిమానులు సీఎం జగన్‌ను చూసేందుకు తరలి వచ్చారు. పార్టీ జెండాలు చేతబట్టి ఎండను సైతం లెక్కజేయకుండా ఉత్సాహంతో కదం తొక్కారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని చూడాలని ఉదయం నుంచే ఎండను సైతం లెక్క చేయకుండా ఎదురుచూశారు. శుక్రవారం ఉదయం 10.46 గంటలకు ఎస్టీరాజాపురంలో బస్సు యాత్ర ప్రారంభమైంది. విడిది నుంచి బస్సు ఏడీబీ రోడ్డు పైకి రాగానే ప్రజలు, అభిమానులు, మహిళలు, యువకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ సీఎం, సీఎం అంటూ నినాదాలు చేశారు. భారీగా తరలి వచ్చిన ప్రజలను చూసి సీఎం అభివాదం చేశారు. అనంతరం బస్సు డోర్ తీసి కాసేపు అభిమానులతో ముచ్చటించారు. సీఎం జగన్‌తో కరచాలనం చేసేందుకు **యువత పోటీ పడ్డారు. అక్కడి నుంచి ముందుకు సాగుతూ అంబేడ్కర్ సెంటర్‌లో వేచి చూస్తున్న వృద్ధులు, మహిళలు, యువకులను చూసి ఆప్యాయంగా పలకరిస్తూ అభివాదం చేశారు. అనంతరం 11.04 గంటలకు వడిశలేరు సెంటర్‌కు వచ్చిన** సీఎం బస్సుయాత్ర అక్కడ వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, వడిశలేరు సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు ఆధ్వర్యంలో వేలాదిగా తరలి వచ్చిన జన సందోహానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం చేశారు.

వినతి పత్రాల స్వీకరణ

వడిశలేరు సెంటర్‌లో సీఎం జగన్ బస్సు దిగి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా చాగల్నాడు ఎత్తిపోతల పథకం అభివృద్ధిని కోరుతూ రైతులు మామిరెడ్డి శ్రీరామకృష్ణ, నిమ్మలపూడి శ్రీధర్, నలమాటి భీముడు, బులిరాజులు ఇచ్చిన వినతి పత్రాన్ని తీసుకున్నారు. మెడికల్ టెస్ట్‌లో అనర్హత కారణంగా ఉద్యోగం కోల్పోయిన రాజానగరానికి చెందిన 13 మంది ఆర్టీసీ డ్రైవర్లు తమకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని అందించిన వినతి పత్రాలను స్వీకరించారు. స్థానిక యువకులతో ముచ్చటించి కరచాలనం చేశారు. వడిశలేరులో మహిళలు సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో డ్యాన్సులు చేశారు. మండల కేంద్రమైన రంగంపేట గ్రామానికి 11.29 గంటలకు చేరుకున్న బస్సు యాత్ర అక్కడ అనపర్తి వైఎస్సార్ సీపీ మండల **కన్వీనర్ నల్లమిల్లి ము**రళీమోహన బాలకృష్ణారెడ్డి, **బిక్కవోలు మండలా**నికి చెందిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, రంగంపేట మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నల్లా శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో మూడు మండలాలకు చెందిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలకు అధిక సంఖ్యలో సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలు బస్సు పైకి చేరుకుని అందరికీ అభివాదం చేశారు. ఈ సందర్భంగా యువత సీఎం, సీఎం అంటూ నినాదాలతో కూడలి మొత్తం హోరెత్తించారు. అనంతరం 11.36 గంటలకు రంగంపేట నుంచి బస్సుయాత్ర బయలుదేరి 11.49 గంటలకు కోటపాడు చేరుకుని అక్కడ తమ అభిమాన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు పెద్ద ఎత్తున వచ్చిన జనానికి అభివాదం చేసుకుంటూ 12.20 గంటలకు కాకినాడ జిల్లా పెద్దాపురంలోకి బస్సు యాత్ర ప్రవేశించింది.

ఏడీబీ రోడ్డుపై అభిమానుల బారులు

రాజానగరం: ఎస్టీ రాజాపురంలో రాత్రి బస చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రజలు స్థానిక ఏడీబీ రోడ్డుపై బారులు తీరారు. ఉదయం 8 గంటలకే బస చేసే ప్రాంతానికి భారీగా చేరుకున్నారు. అలాగే సీఎం జగన్‌ను కలిసిందుకు వివిధ ప్రాంతాల నుండి పలువురు నేతలు కూడా తరలివచ్చారు. వారిలో రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, విడుదల రజనీ, ఎమెల్సీలు తోట త్రిమూర్తులు, అనంతబాబు, ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, జ్యోతుల చంటిబాబు, మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు, నాయకులు జక్కంపూడి గణేష్, జక్కంపూడి విజయలక్ష్మి, నల్లమిల్లి శేషారెడ్డి, కాకినాడ మాజీ మేయర్ సరోజ తదితరులు ఉన్నారు.



సీఎం జగన్ బస్సు యాత్రలో పాల్గొన్న సినీ నటుడు గౌతంరాజు



ఎస్టీ రాజాపురంలో తమ నాయకుడి రాక కోసం ఎదురుచూస్తున్న యువత

ప్రజాదరణలో జగనన్నకు తిరుగులేదు



సిద్ధం సభకు వెళుతున్న బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి

బిక్కవోలు: ప్రజాదరణలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తిరుగులేదని జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి అన్నారు. శుక్రవారం కాకినాడ సిద్ధం సభకు వెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల బస్సును ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ఇంటింటికీ మేలు చేసిన జగనన్న ప్రజల గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. జగనన్న రోడ్‌షోలో, సభల్లో కనిపిస్తున్న ప్రజాదరణే దానికి సంకేతమన్నారు. కార్యక్రమంలో కొంతుదురు ఎంపీటీసీ సభ్యుడు పీపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, సర్పంచ్ సత్తి వీరమణి తదితరులు పాల్గొన్నారు. ఊలపల్లిలో జగనన్న సభకు బస్సు ప్రారంభ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ బండారుశివ, పందలపాకలో జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, తొస్సిపూడిలో వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: గడ్డి కోసేందుకు వెళ్లిన వ్యక్తి డ్రైనేజీలో పడి మృతి చెందాడు. హుకుంపేటకు చెందిన అవివాహితుడు పుట్టా శివరామకృష్ణ (42) తల్లితో కలిసి జీవిస్తున్నాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో గడ్డి కోసేందుకు వెళ్లాడు. మధ్యాహ్నమైనా ఇంటికి భోజనానికి రాకపోవడంతో అతడి సోదరుడు కృష్ణ చౌదరి, బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే సాయంత్రం 5 గంటల సమయంలో గోల్డెన్ సెలబ్రేషన్స్ ఫంక్షన్ హాలు వెనుక ఉన్న మేకప్పు చెరువు మెయిన్ డ్రైనేజీలో శివరామకృష్ణ మృతదేహం కనిపించింది. ఎండ తీవ్రతకు స్పృహ తప్పి డ్రైనేజీలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. బొమ్మూరు ఎస్సై బి.శ్రీను సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కృష్ణ చౌదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి



మహేంద్రవాడలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న సత్తి ఆదిలక్ష్మి

అనపర్తి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా నవరత్న పథకాలకు రూపకల్పన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ఆమె మండలంలోని మహేంద్రవాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ, సుపరిపాలన కోసం సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే నెల 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఆమె ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, గ్రామ ప్రముఖులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం చారిత్రక అవసరం

- జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



నామినేషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించడం చారిత్రక అవసరంగా ప్రజలు ఇప్పటికే గుర్తించారన్నారు. రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కోవిడ్ ప్రభావంతో సమస్యలు ఉన్నప్పటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో తిరుగులేని అభివృద్ధిని సాధించామన్నారు. గడచిన ఐదేళ్లలో రూ.1,773 కోట్లతో అభివృద్ధి పనులు, మరో రూ.1,377 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. 20,178 మందికి నివాస స్థలాలకు పంపిణీ చేశామన్నారు. 2019లో గెలిచిన నాటి నుంచి ఇప్పటి వరకూ నిరంతరం ప్రజలలోనే ఉంటున్నామన్నారు. అమ్మ విజయలక్ష్మి, భార్య డాక్టర్ రాజశ్రీ, తమ్ముడు గణేష్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. తన తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు పేరిట ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా అనేక రకాల సేవలు అందజేస్తున్నామని గుర్తు చేశారు. దోపిడీ దొంగలు, దోపిడీదారులు, హత్యలు చేసిన వారు, మహిళలను విదేశాలకు అమ్మేసిన వారు, ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోకరా వేసిన వారు ఈ ఎన్నికలలో పోటీకి తయారయ్యారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విమర్శించారు. గురివింద గింజ తరహాలో తమ దోషాలను కప్పిపుచ్చుకుంటూ తన కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాజకీయ నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చిన తాను ఎటువంటి వాడినో ప్రజలకు తెలుసునన్నారు. ఈ ఎన్నికలలో తాను, పార్టీ శ్రేణులు ప్రయత్నం చేసేది గెలుపు కోసం మాత్రమే కాదని, 40 వేల నుండి 50 వేల మెజార్టీని సాధించడం కోసమేనని జక్కంపూడి రాజా స్పష్టం చేశారు.

జక్కంపూడి రాజా నామినేషన్ దాఖలు

రాజానగరం: స్థానిక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తెల్లవారుజామున బిక్కవోలు వెళ్లి లక్ష్మీగణపతిని దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం అక్కడ నుంచి రాజమహేంద్రవరం వచ్చి గోదావరి తీరాన ఉన్న అయ్యప్పస్వామిని, కోరుకొండ లక్ష్మీనరసింహస్వామిని, రాజానగరంలోని షిరిడీ సాయిబాబాను దర్శించుకున్నారు. తదుపరి ఉదయం 11 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణికి ఒక సెట్టు నామినేషన్ పత్రాలను అందజేశారు. డమ్మీ అభ్యర్థిగా ఆయన సతీమణి డాక్టర్ రాజశ్రీ మరో సెట్టు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. జక్కంపూడి రాజా దంపతుల వెంట బంధువులు గంధం నారాయణరావు, జక్కంపూడి సుకీర్తి, ఆడిటర్ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో మాధురి

అనపర్తి: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి సూచించారు. శుక్రవారం స్థానిక జీబీఆర్ సెమినార్ హాలులో నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని బూత్ లెవెల్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆర్వో మాట్లాడుతూ బీఎల్ఓలు తమ పరిధిలోని ఓటరు జాబితాలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ఫారం-17 సీ, మార్క్ పోల్ సర్టిఫికెట్ కాపీని విధిగా బస్సులు బయలుదేరే సమయానికి రిటర్నింగ్ అధికారికి అందజేయాలన్నారు. మెరుగైన పనితీరు కనబరిచిన బీఎల్ఓలను ఆమె అభినందించారు. సమావేశంలో తహసీల్దార్లు డి.సునీల్‌బాబు, బి.కన్యాకుమారి, లతీఫ్‌బాషా, రాజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో జై అరవింద్

సీటీఆర్ఐ: ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులకు ఖర్చుల విషయంలో పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని, అదే సమయంలో ఖర్చుల రిజిస్టర్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పార్లమెంట్ ఎన్నికల ఖర్చుల పరిశీలకుడు జై అరవింద్ అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాధవీలత వివరాలు తెలియజేస్తూ జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలలో ఎన్నికల కమిషన్ నియమావళిని అనుసరించి కార్యాచరణ రూపొందించామన్నారు. సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. ఖర్చుల పరిశీలనపై అత్యంత జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో జేసీ ఎన్. తేజ్ భరత్, మున్సిపల్ కమిషనర్ కే.దినేష్ కుమార్, డీఆర్వో జి.నరసింహులు పాల్గొన్నారు.